
# అబిటిడు




## రాపేటి రామకృష్ణారావు

అది 2085వ సంవత్సరం, జనవరి నెల ఒకటో తేదీ రాత్రి వీడియో చూస్తూ ఆలస్యంగా నిద్ర పోవడం వలన కాస్త ఆలస్యంగాలేచాడు అన్వేషణ్. కళ్ళు నులుముకుని గోడమీది ఎలక్ట్రానిక్ గడియారాన్ని చూశాడు. 8 గంటల 5 నిముషాలు చూపిస్తూంది. ఎనిమిది గంటల నుంచి ఎనిమితింపావుదాకా శుభోదయం పత్రిక ప్రసారం చేసేవార్తలు తప్పకుండా అతడు వింటాడు. ఏడో చానల్‌ని ఆసమయంలో దూరదర్శన్ వాళ్ళు శుభోదయం పత్రికకి కేటాయించారు. తదితర పత్రికలకి కూడా సమయాలూ ఛానల్సూ కేటాయించడం జరిగింది. ఎవరికి ఇష్టం వచ్చిన వార్తలు వారు వింటారు.

అప్పటికే అయిదు నిముషాలవార్తలు మిస్ కావడం చేత గబగబా తలగడ క్రింద పెట్టిన కార్డ్ లెస్ రిమోట్ కంట్రోలుతో టి.వి.ని ఆన్ చేశాడు. ఏడో ఛానల్ బటన్ నొక్కాడు. టి.వి. తెరమీద ఎవొవ్వరు ప్రత్యక్షమయ్యాడు. ఆనాటి వార్తలలో పెళ్ళికాని యువకుని ఆత్మహత్య, కనీసవేతనం అయిదు వేలకి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమ్మె, చంద్రుని మీద మనిషి కృత్రిమ వాతావరణంతో నిర్మించిన కోలనీలో అక్కడికి వలస వెళ్ళి నివసిస్తున్న శాస్త్రజ్ఞులు, కూరగాయలనూ, పుట్టగొడుగులనూ పెంచగలగడం వున్నాయి. అన్వేషణ్‌ని చివరి అంశం బాగా ఆకట్టుకుంది. చంద్రుని మీది కూరగాయలూ, పుట్టగొడుగులకూ సంబంధించిన విజ్యువల్స్‌ని కూడా రంగుల్లో ప్రసారం చేశారు.

కథల పోటీలో సాధారణప్రచురణకు ఎన్నికైన కథ



## విడాకులు

"ఎందుకమ్మా మీ వారిని విడాకులు అడుగుతున్నావు?" అడిగాడు లాయర్ వెంకమ్మని.
"నిన్నర్లు కుట్టుకోడానికి ..." చెప్పింది వెంకమ్మ.

ఎం.శ్రీకర్
నిజామాబాద్

బాత్‌రూమ్‌కి వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకున్నాడు. వేడినీటితో స్నానం చేశాడు. కొత్తబట్టలు వేసుకుని గదిలో నిద్రపోతున్న వాళ్ళనాన్నని లేపాడు.

అన్వేషణ్ తండ్రి ప్రవీణ్‌బాబు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగి. అరవై ఏళ్ళునిండగానే రిటైరయ్యాడు. తెలిసిన ఆఫీసర్లు దయదలిచి అతనికొడుకు అన్వేషణ్‌ని గుమాస్తాగా ఎపాయింట్ చేశారు. నెలకి జీతం అయిదు వేలు వస్తున్నాయి. ప్రవీణ్‌బాబుకి కూడా మూడువేల రూపాయల దాకా పెన్షన్ వస్తున్నది. అయినా నెల తిరక్కముందే ఖర్చయిపోతున్నాయి. రిటైరైనప్పుడు వచ్చిన మూడు లక్షల రూపాయలతో అప్పులు తీర్చి, పాత ఇల్లుని రిపేరు చేయించగా యాభైవేలు మాత్రం మిగిలి వున్నాయి. ఆ డబ్బుని కొడుకు పెళ్ళికోసం కన్యాశుల్కంగా ఇవ్వడానికి భద్రంగా కాపాడుతున్నాడు. ఎంత పేదపిల్లని చేసుకోవాలన్నా లక్షరూపాయల శుల్కం అడుగుతున్నారు. జీతంలో మంచి రూపాయి కూడా ఆదాకావడంలేదు. కొడుకు పెళ్ళి ఎలాగ చెయ్యాలో అర్థంకాక ఎప్పుడూ అదే విషయం ఆలోచించడం చేత అతనికి నిద్రపట్టదు. కొడుకు నిద్రలేవగానే బద్ధకంగా లేచి గబగబా ముఖం కడుక్కుని టిఫిన్ చెయ్యడానికి కిచెన్ గదిలోకి ప్రవేశించాడుప్రవీణ్‌బాబు.

అప్పటికే ఇన్‌స్టెంటు సప్లయర్‌లో మంచికావలసిన బ్రెడ్ ముక్కలు, ఆమ్లెట్లు వేడిచేసి టేబుల్‌మీద వాళ్ళ నాన్నకీ, తనకీ సిద్ధం చేసిపెట్టాడు అన్వేషణ్. ఇద్దరూ టిఫిన్ చెయ్యడం మొదలు పెట్టారు.

అన్వేషణ్ తండ్రితో "ఈవేళ ఎవరో యువకుడు హుస్సేన్‌సాగర్‌లోపడి ఆత్మహత్య చేసుకున్నాడట నాన్నా. శుల్కం సమస్యే. దానికే ఆత్మహత్య చేసుకోవాలా? పెళ్ళిచేసుకోకుండా బ్రతకలేమా"అన్నాడు.

ప్రవీణ్‌బాబు ఆవేదనగా "అలాంటి వార్తలు నేను రోజూ పేపర్లలో చదువుతూనే వుంటాను. ఆత్మహత్య మహాపాపం. దానంత తెలివితక్కువతనం మరొకటుండదు. బ్రతికివున్న తల్లిదండ్రుల గురించి ఆలోచించాలి. వాళ్ళగతి ఇప్పుడేమికావాలి?" అన్నాడు.

"నాన్నా! అసలు వరకట్నాలు పోయి మళ్ళీ కన్యాశుల్క యుగం ఎలా వచ్చింది. యాభై ఏళ్ళక్రితం దాకా అబ్బాయిలే కట్నాలకోసం లాంఛనాల కోసం పెళ్ళి కూతురి తల్లిదండ్రులను పీడించేవారని చదివాను"అని అడిగాడు అన్వేషణ్.

ప్రవీణ్‌బాబు టిఫిన్ చెయ్యడం ఆపేశాడు. గతంలోని చేదు అనుభవాలు అతనిమెదడులో దృశ్యాలు కట్టాయి. కొడుకు ప్రశ్న అతడిని కలవరపరిచింది. పెళ్ళి చేసుకుని హాయిగా కాపురం చెయ్యవలసిన కొడుకు సంఘంలో జరుగుతున్న దురాచారాలకు బలైపోతున్నాడు అనుకుని "నిజమే బాబూ! వరకట్న దురాచారం వేనెరిగే దాకా వుంది. యస్.యస్.ఎల్.సి. ఫెయిలై ప్యూన్ ఉద్యోగం చేసేవాడు కూడా లక్ష కట్నం అడిగేవాడు. ఆడపిల్ల పుడితే చాలు 'ఛీ' అని ఛీదరించుకునే వారు జనం. ఖర్మం కొద్దీ వైజ్ఞానికంగా ఎదిగిన మనిషి దానికి మార్గాంతరం కనుక్కున్నాడు. పుట్టబోయే బిడ్డ 'మగా'లేక 'ఆడా' అనే విషయాన్ని తల్లి గర్భం దాల్చగానే కనిపెట్టేసే యంత్రాలు వచ్చేశాయి. ప్రభుత్వం ఎన్ని కట్టుబాట్లు చేసినా, కుటుంబ నియంత్రణ సాకుతో ఆడుపిల్లలని మాత్రం భ్రూణ హత్యలు చేసి సంతోషించింది సంఘం. దాంతో ఎవ్వరికీ తెలియకుండానే ఆడపిల్లలకి కరువు ఏర్పడింది. ఈనాడు ఆడపిల్లలు ఆడింది ఆటగా పాడింది పాటగా తయారయింది పరిస్థితి" అని చెపుతున్న అతని గొంతు దుఃఖంతో పూడుకపోయింది.

"అదేమిటినాన్నా అలా బాధపడతావు. సాంఘిక దురాచారానికి నువ్వేం చేస్తావు"అని సముదాయిస్తూ అన్నాడు అన్వేషణ్.

గొంతు సవరించుకుని "నాబాధకి కారణం వుందిరా! 2048 సంవత్సరంలో నాకు పెళ్ళయింది. కట్నాల భయంతో ఆడపిల్లలను కనగూడదనుకున్నాను. మీ అమ్మకి మొదటి మూడు గర్భాలూ ఆడపిల్లలే కావడం చేతడాక్టర్లకి రహస్యంగా డబ్బుకట్టి మీ అమ్మ ఎంత మొత్తుకున్నా వినకుండా అకడుపులు తీయించేశాను. తరవాత మరో ఆరేళ్ళకి పిల్లలింకా పుట్టరేమో అని భయపడుతూ వుండగా నువ్వు కడుపునపడ్డావు. మగపిల్లవాడేనని క్లినిక్ డాక్టర్లు పరీక్షించి చెప్పారు. ఎంతో సంతోషించి మరిపిల్లలు పుట్టకుండా ఆపరేషను చేయించుకున్నాను. నువ్వు పెరిగి పెద్దయ్యేసరికి మగవాళ్ళే చవకైపోయారు. హాయిన నీ అక్కల్లో ఒక్క పిల్లని బ్రతకనిచ్చినా ఆ అమ్మాయి మీద సంపాదించే శుల్కంతో నీ పెళ్ళి సుళువుగా చేసేసే వాడినిరా"అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు ప్రవీణ్‌బాబు.


అన్వేషణ్ బి.ఎస్.సి. పాసయ్యాడు. సైన్సు కాస్తో కూస్తో తెలుసును. ఆడపిల్లల్నిగాని, మగపిల్లల్నిగాని కోరుకున్నట్లే కనడం పెద్ద సమస్యకాదు. క్రోమోజోమ్స్ ఎనలైజర్‌తో తెలుసుకుని వీర్యకణాలలోని 'వై' కణాన్ని గర్భాశయంలోకి ప్రవేశపెడితే మగపిల్లవాడు, 'ఎక్స్' కణాన్ని ప్రవేశపెడితే ఆడపిల్ల పుడతారు. కాని అలాగ చెయ్యడం ఎంతతప్పు. కేవలం కాకతాళీయంగా జరిగే గర్భధారణ సృష్టిలోని ఆడా, మగా నిష్పత్తిని క్రమ పరస్తుంది. అలాంటి నిష్పత్తిని అదుపు చెయ్యాలనుకోవడం ఎంత మూర్ఖత్వం. సృష్టికార్యానికి ఆడా మగా సమంగానే అవసరం. అలాంటప్పుడు ఒక జాతి తక్కువ అనుకోవడం ఏం సబబు. అన్నీ తెలిసినా మేధావులెంత మొత్తుకుని చెప్పినా సమాజం ఎందుకని మారదు, దురాచారాలను ఎందుకు పోషిస్తుంది. అన్వేషణ్ బుర్రవేడెక్కి పోయింది. కట్నాల దురాచారాన్ని పెంచి ఆడపిల్లలను హత్య చేసిన సంఘం మీద అతనికి కోపం వచ్చింది. దానిమూలంగా తన లాంటి యువకులిప్పుడు బలిపశువులయ్యారు అనుకున్నాడు.

టిఫిన్ ముగించారు. వేడివేడి కాఫీ తాగి తండ్రీ కొడుకులిద్దరూ ఎంగిలి పళ్ళాలను డిష్ వాషర్‌లో పడేశారు. అవి వేడినీటితో శుభ్రం అయి మరో అరలోకి వెళ్ళిపోయాయి.

ప్రవీణ్‌బాబు టవల్‌తో చేతులు తుడుచుకుంటూ "అన్వేషణ్! రోజూలాగా పొద్దుపోయేదాకా వుండిపోయేవు. ఈ రోజు పెళ్ళిచూపులకి ఆడపెళ్ళివారు వస్తున్నారని మరిచిపోకు"అని కొడుక్కి జ్ఞాపకం చేశాడు.

"అలాగేనాన్నా" అని చెప్పి తయారై ఆఫీసుకి బయలుదేరి వెళ్ళిపోయాడు.

కొడుకు వెళ్ళిపోగానే అయిదేళ్ళ క్రితం చనిపోయిన అతని భార్య జ్ఞాపకం వచ్చింది ప్రవీణ్‌బాబుకి. ఆమె



బతికి వుంటే పెళ్ళీడుకెదిగిన కొడుకుని చూసి ఎంత సంతోషించేవో, వయసు ముదిరి పోతున్నా శుల్కం ఇచ్చుకోలేక అబ్బాయికి పెళ్ళి చెయ్యలేని ప్రస్తుత పరిస్థితికి అంత ఏడ్చేది అనుకున్నాడు. తను ఉద్యోగం చేస్తున్నప్పటిరోజులు, చదువుకునే నాటిరోజులు, భార్య వంట తినేరోజులు అతని మదిలో మెదిలాయి. తరువాత పెళ్ళివారి ఆతిథ్యానికి కావలసిన ఏర్పాట్లలో మునిగిపోయాడు.

**

సాయంత్రం నాలుగు గంటలకే అన్వేషణ్ ఇంటికి వచ్చాడు. నవమన్మథుడిలాగా తయారయ్యాడు. పెళ్ళికూతురి రాకకోసం ఇద్దరు తండ్రీకొడుకులూ ఎదురు చూడసాగారు. అంతలో కారు హారన్ వినిపించింది. అన్వేషణ్ వీధిగుమ్మంలోకి వెళ్ళి చూశాడు. పెళ్ళికూతురు, ఆమెతల్లి దండ్రులు మరో ఇద్దరులమ్మాయిలు పెళ్ళికూతురి చెలికత్తెలు కాబోలు కారు దిగడం చూశాడు. లోనికి వెళ్ళి "నాన్నా వాళ్ళు వస్తున్నారు. నాగదిలో వుంటాను. అవసరమైనప్పుడు పిలు"అని చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

పెళ్ళిచూపులవారు లోనికి వచ్చి హాలులోని ఎదురుగా వున్న రెండు సోఫాసెట్లమీద కూర్చున్నారు.

మధ్య టీపాయ్ మీద ప్లేట్లలో సర్దివున్న ఫలహారాన్ని చూపించి "తీసుకోండి" అని మర్యాదపూర్వకంగా చెప్పాడు ప్రవీణ్‌బాబు.

పెళ్ళికూతురితల్లి "అబ్బాయిని రమ్మనండి" అని ఆజ్ఞ జారీ చేసింది. ప్రవీణ్‌బాబు అన్వేషణ్‌ని రమ్మని పిలిచాడు. అన్వేషణ్ ఠీవిగా వచ్చి తనకి నిర్దేశించిన సోఫా మీద కూర్చున్నాడు. రెప్పవెయ్యకుండా పెళ్ళికూతురు అతనిని చూస్తూవుండిపోయింది. ఇద్దరి చూపులూ కలిశాయి. ఒకరికి ఒకరి బాగానచ్చారు అని అందరూ అర్థంచేసుకున్నారు. కాని తినేసేలాగ మరీ సిగ్గులేకుండా చూస్తున్న పెళ్ళికూతురి చెలికత్తె చూపులు భరించలేక అన్వేషణ్ తలవంచుకున్నాడు. పరపురుషుణ్ణి అలాగ చూడవచ్చునా? నీతిమాలిన ఆడజాతి అనుకున్నాడు.

తరవాత ఆడపెళ్ళివారు పెళ్ళికొడుక్కి వంట చెయ్యడం వచ్చా? పాటలు బాగాపాడతాడా? జీతం ఎంత సంపాదిస్తున్నాడు? మొదలైన ప్రశ్నలకి అనుకూలమైన సమాధానాలే రాబట్టుకున్నారు.

ప్రవీణ్‌బాబు పెళ్ళికూతురి పేరు సబల అనీ ఆమె స్నేహితురాళ్ళ పేర్లు ఝాన్సీరాణీ, సంయుక్త అని అడిగి తెలుసుకున్నాడు. పేర్లలోకూడా స్త్రీ ఆధిక్యత కొట్టవచ్చినట్లు అతనికి కనిపించింది.

అన్నీ నచ్చిన తరవాత శుల్కాల బేరం సాగింది. పెళ్ళికూతురి తల్లి లక్షరూపాయిల శుల్కం ఇస్తేనేగాని అబ్బాయిని చేసుకోవడం జరగదని నిర్మొహమాటంగా చెప్పింది. యాభైవేలకన్నా ఇచ్చుకోలేనని వున్న ఇల్లూ పొల్లూ తన కొడుక్కే చెందుతాయని ఎంతో దీనాతి దీనంగా బతిమాలాడు ప్రవీణ్‌బాబు. వాళ్ళు ఒప్పుకోలేదు. వచ్చిన త్రోవనే పెళ్ళివారు లేచివెళ్ళి పోయారు.

అన్వేషణ్‌కి పెళ్ళి చూపులకి కూర్చోవడం మొదటి సారికాదు. అయినా ఈ మారెందుకనో అమ్మాయి నచ్చింది. అమ్మాయికి కూడా తాను నచ్చినట్లు ఆమె కళ్ళమెరుపు చూసి తెలుసుకున్నాడు. చాలా అవమానం అనిపించింది. బ్రహ్మచారిగానన్నా వుండిపోవాలిగాని మరో మారు పెళ్ళిచూపులకి మాత్రం ఒప్పుకో కూడదు అని నిశ్చయించుకున్నాడు. అతని మెదడులో ఆలోచనలు బయలుదేరాయి.

సృష్టిలో సెలక్షన్ అనేది వుంది. అవసరమైనదే సృష్టిలో పెరుగుతుంది. ఆర్టిఫిషియల్ సెలెక్షన్ మొదలుపెట్టి తనకి కావలసిన వాటినే మనిషి పెరగనిస్తున్నాడు. వద్దనుకున్నవాటిని కలుపు మొక్కల్లాగా తీసేస్తున్నాడు. మనిషి తెలివైనవాడు గనుక జంతుజాలాను వృక్షాలను అలాగ అరికట్టగలడేమోగాని నేచురల్ సెలెక్షన్‌ని మాత్రం గౌరవించకతప్పదు. అదే స్త్రీ పురుషుల మధ్య గల ఆకర్షణ. ఓ అందమైన స్త్రీ ఓ పురుషుణ్ణి ఆకర్షిస్తుంది. అలాగే ఓ అందమైన పురుషుడు ఓ స్త్రీని ఆకర్షిస్తాడు. అలాగ ఆకర్షణకు లోనైన ఇద్దరి స్త్రీ పురుషులకు వివాహం చేస్తే వారి దాంపత్యం సుఖవంతమౌతుంది. వారి సంతానం పెరుగుతుంది.


నన్ను కుక్క అని పిలుస్తావ్రటా .. ఒక వృద్ధుని ఆగ్రహం
అనవసరంగా మొరక్కండి, నేను మిమ్మల్నలా పిలవలేదు.

అంతేగాని శుల్కాలు, కట్నాలు , కుల మత భేదాలు అనేవి ప్రకృతి సిద్ధమైన సెలక్షన్‌కి అడ్డంవస్తాయి. కేవలం డబ్బుకోసం ఇష్టంలేని పెళ్ళిళ్ళు చేస్తే నానాటికి తీసికట్టు నాగంభట్లూ అన్నట్లు కుక్కమూతి పిందెల్లాంటి పిల్లలు పుడతారు. అలాంటి సమాజం ప్రకృతి పరీక్షలకు తట్టుకోలేక త్వరగా నశిస్తుంది అనుకున్నాడు.

ఒక పక్క అబ్బాయి కావాలి, మరో పక్క శుల్కం కావాలి అనీ ఆశిస్తున్న స్త్రీ జాతి మీదకన్నా దీనికంతటికీ మూలకారణం అయిన నాటి అమ్మాయికావాలి. అందంగా వుండాలి చదువుకోవాలి అన్నీ వున్నా లక్షల కట్నం తేవాలి అని ఈ పరిస్థితిని సృష్టించి ఆడపిల్లల భ్రూణ హత్యలకు కారకులైన మగ వెధవలంటేనే అన్వేషణ్‌కి అసహ్యం వేసింది. మగవారికి ఈ శిక్ష కావాలి అనుకున్నాడు.

ప్రవీణ్‌బాబు షాక్ తిన్నవాడిలాగ తన గదిలోకి వెళ్ళిపడుకున్నాడు. వాళ్ళ నాన్న అవస్థ చూసి జాలి పడ్డాడు అన్వేషణ్. వీడియోలో తనకి అత్యంత ప్రేమ పాత్రమైన 'కన్యాశుల్కం' కేసెట్ వేసుకున్నాడు. గురజాడ అప్పారావు ఇరవైయ్యో శతాబ్దం ఆరంభంలో రాసిన నాటకం అది. అప్పటికీ, ఇప్పటికీ ఏమిటి తేడా. అప్పుడూ అమ్మాయిలను అమ్ముకున్నారు. తరవాతి తరంలో అబ్బాయిలను వేలం పాటకి పెట్టారు. మళ్ళీ కథ అడ్డంతిరిగింది. మళ్ళీ కన్యాశుల్కం. మనిషి మారేదెప్పుడు. గతపు చేదు అనుభవాల నుంచి మనిషి ఏమి నేర్చుకున్నాడు అనుకున్నాడు వీడియో ఆఫ్ చేశాడు.

రాత్రి ఎనిమిది గంటలయింది. పేపరు చదువుకుంటున్న వాళ్ళనాన్నని పిలిచి ఇద్దరికీ వడ్డించాడు. భోజనం చేసి వాళ్ళనాన్న తన గదిలోకి వెళ్ళి నిద్రపోయాడు.

అన్వేషణ్ డాబామీద పక్క వేసుకున్నాడు. ఆ రోజు అమావాస్య. కాని కృత్రిమ చందమామ వెన్నెల పుచ్చపువ్వులాగా కాస్తుంది. మనిషి మేధస్సు ఎంత గొప్పది. స్థిరకక్ష్యలో మూడు కృత్రిమ చందమామలను ప్రయోగించాడు. వీధి దీపాల అవసరం లేకుండా చేశాడు. భూమి మీది చీకట్లనే తరిమేశాడు. కాని తన అంతరంగంలోని చీకటిని అలాగే భద్రంగా దాచుకుంటున్నాడు అనుకుంటూ నిద్రలోకి జారిపోయాడు.

**

